క్లుప్తంగా

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

ఖమ్మంలీగల్: బోనకల్ మండలం జానకిపురం గ్రామంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు శనివారం న్యాయవాది తాళ్లూరి దిలీప్‌చౌదరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గత 6 నెలలుగా ఖాళీగా ఉన్నా పబ్లిక్ ప్రాసిక్యూటర్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ పోస్టులతో పాటు అదనపు అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులను భర్తీ చేయాలని వినతిపత్రం అందించారు. ఇందుకు భట్టి సానుకూలంగా స్పందించి భర్తీ చేస్తామని హామీ ఇచ్చినట్లు న్యాయవాది తెలిపారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యాన శనివారం ఆ సంఘం కో ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చి ఫాస్టర్ ప్రత్యేక ప్రార్థనలు చేశాక క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఎం.వేలాద్రి, జిల్లా నాయకులు బుల్లెట్ శ్రీనివాసరావు, గుంటుపల్లి శ్రీనివాసరావు, రమేష్‌లతో పాటు ప్రకాష్‌రావు, కోడి లింగయ్య, వెంకటేశ్వరరావు, డి.వసంతరావు, నాగేశ్వరరావు, అజ్మల్‌బేగ్, గిరిజ, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఖమ్మం–అల్లీపురం ఆర్‌అండ్‌బీ రోడ్డును రెండు లేన్ల నుంచి నాలుగు లేన్లుగా విస్తరించే పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పది మంది ఇళ్లలో కొందరివి పూర్తిగా, మరికొన్ని పాక్షికంగా తొలగించాల్సి వస్తోంది. ఇప్పటికే మార్కింగ్ చేసిన నేపథ్యాన న్యాయమైన రీతిలో పరిహారం చెల్లించడమే కాక పూర్తిగా ఇల్లు కోల్పోతున్న వారికి మరోచోట కట్టించి ఇవ్వాలని తిరుపతిరావు, బాలకృష్ణ, పాషా, సైదులు, నాగేశ్వరరావు, వెంకటి, పుల్లయ్య, అచ్చయ్య తదితరులు కోరుతున్నారు.

సన్మానం

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన న్యాయవాది టెంకటి వెంకటేశ్వర్లు తన 30 ఏళ్ల న్యాయవాద వృత్తిని పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం తిరుమలాయపాలెంలో సీపీఎం ప్రజాసంఘాల ఆధ్వర్యాన సన్మానించారు. విద్యార్థి ఉద్యమం నుంచి నేటి వరకు వామపక్ష భావాలతో అనేక మందికి న్యాయ సేవలు అందించి ఆదర్శంగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ బషీరుద్దీన్, శ్రీను, నర్సయ్య, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, స్వామి, సుధాకర్, నాగేశ్వరరావు, బాబురావు, యశోధ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు అందజేత

కూసుమంచి: మండలంలోని కస్తూర్బా బాలికా విద్యాలయం విద్యార్థినులకు ప్రభుత్వం అందించిన దుప్పట్లను విద్యాశాఖ సీఎంఓ రాజశేఖర్ అందజేశారు. శనివారం ఆయన విద్యాలయాన్ని సందర్శించి పలు వసతులను పరిశీలించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యార్థుల మెనూను తనిఖీ చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

పండ్లు..

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): ఖమ్మం పెద్దాస్పత్రిలో జమాతే ఇస్లామీ హింద్ మహిళ విభాగం ఇందిరానగర్ శాఖ ఆధ్వర్యాన శనివారం పండ్లను పంపిణీ చేశారు. అనంతరం జేఐహెచ్ ఇందిరానగర్ శాఖ అధ్యక్షురాలు హుస్నేన్‌బీ, బాధ్యులు ఆరిఫా, జాహేరా, వాహేదా, అఫ్సర్ సుల్తానా, షమీమ్, రహమత్, ఆసియా, హబీబాలు ఆస్పత్రిలోని డాక్టర్లు, నర్సులను కలుసుకొని వైద్య సేవలపై ఆరా తీశారు. మానవసేవే మాధవసేవగా భావిస్తూ ఈ సేవా కార్యక్రమాన్ని తలపెట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

కామేపల్లి: మండలంలోని బర్లగూడెం జీపీ పరిధిలోని కొత్తతండాకు గత కొద్ది రోజులుగా తాగునీటి సమస్య ఏర్పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని శనివారం స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధింత అధికారులు వెంటనే స్పందించి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం

నేలకొండపల్లి: మండలంలోని అప్పలనరసింహాపురం గ్రామపంచాయతీ వర్కర్ ఎస్.శ్రీనివాసరావు ఇటీవల మృతి చెందగా.. పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఆర్థిక సాయం చేశారు. శనివారం దశ, దిన కార్యక్రమం సందర్భంగా మృతుడి చిత్రపటానికి నివాళులర్పించాక కుటుంబసభ్యులకు మండల యూనియన్ రూ.5 వేలు, స్థానిక గ్రామపంచాయతీ కార్మికులు రూ.5 వేలను నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెనికె జానకిరామయ్య చేతుల మీదుగా అందించారు. ఈక్రమంలో యూనియన్ నాయకులు షేక్ రహిముతుల్లా, వంగూరి నాగరాజు, పొట్టపింజర బాబులు 50 కేజీల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు అనిత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పరిఢవిల్లేలా..

సంక్షేమ శాఖల వసతి గృహాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా డైట్ చార్జీలు 40 శాతం మేర, కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు అన్ని హాస్టళ్లు, గురుకులాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఈనేపథ్యాన శనివారం అన్ని హాస్టళ్లలో ఒకే విధమైన మెనూ అమలయ్యేలా అధికారులు కామన్ డైట్ మెనూను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ కచ్చితంగా అమలయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు.


గురుకులంలో కూరగాయలను పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్

శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదం..

ఖమ్మంఅర్బన్: బలమైన ఆహారంతోనే పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ పేర్కొన్నారు. శనివారం కామన్ డైట్ కార్యక్రమ ప్రారంభోత్సవం సందర్భంగా నగరంలోని అల్లీపురంరోడ్డులోని తెలంగాణ మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్, కళాశాల రెసిడెన్షియల్ స్కూల్లో విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలు, కూరగాయలు, సరుకులను పరిశీలించారు. విద్యార్థుల సౌకర్యాలు, విద్యా బోధన గురించి పాఠశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, ఆపద అనిపిస్తే వెంటనే డయల్ 100, సైబర్ నేరాలకు 1930కు ఫోన్ చేయాలన్నారు. మాదకద్రవాల వాడకం వలన కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మైనారిటీ కాలేజీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మి, అర్బన్ సీఐ భానుప్రకాష్, ఆర్ఐ వహీద్ తదితరులు పాల్గొన్నారు.


గురుకుల ప్రతిభా పాఠశాలలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఐఈఓ రవిబాబు, తదితరులు

రఘునాథపాలెం: మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పేద విద్యార్థులకు వరం అని మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవిబాబు, రఘునాథపాలెం సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం, తహసీల్దార్ విల్సన్‌లు పేర్కొన్నారు. శనివారం రఘునాథపాలెంలోని గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాలలో ఉమ్మడి డైట్ మెనూను ఆవిష్కరించిన సందర్భంగా వారు మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా

పేద విద్యార్థులకు వరం..

సంక్షేమ హాస్టళ్లలో డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం పేద, మధ్య తరగతి విద్యార్థులకు పౌష్టికాహారం అందడంతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణంలో చదువు కొనసాగుతుందన్నారు. ప్రిన్సిపాల్, డిప్యూటీ వార్డెన్, బోధన సిబ్బంది నిరంతర పర్యవేక్షణతో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా డైట్ మెనూ అమలుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లెల బాలస్వామి, వైస్ ప్రిన్సిపాల్ మిట్టపల్లి నరసింహారావు, మాలోత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకులంలో..

మైనారిటీ గురుకుల బాలికల పాఠశాల–1లో కామన్ డైట్ మెనూ కార్యాక్రమాన్ని రఘునాథపాలెం ఉపాధి హామీ పథకం, ఏపీఓ పద్మయ్య నాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణకుమారి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం..


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ, తదితరులు

కూసుమంచి: విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న నాణ్యమైన భోజనాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నూతన మెనూను నాయకన్‌గూడెం, కూసుమంచిలోని సంక్షేమ వసతి గృహాల్లో ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ కరుణశ్రీ, ఏఈ రంజిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మల్లయ్య, వార్డెన్లు పాల్గొన్నారు.

వసతిగృహాల్లోనే పోషకాహారం..


విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లోనే విద్యార్థులకు పోషకాహారం లభిస్తుందని, ప్రభుత్వం విద్యార్థులకు అందించే భోజనంపై ప్రత్యేక దృష్టి సారించిందని ప్రత్యేక అధికారి, ఇరిగేషన్ ఏఈఈ కల్పన, ఎస్సీ బాలుర-బీ వసతిగృహం సంక్షేమ అధికారి కోటపాటి రుక్మారావు అన్నారు. శనివారం కామన్ డైట్ మెనూ లాంచ్ సందర్భంగా ఖమ్మంలోని ఎస్సీ బాలుర-బి వసతిగృహంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి మెనూను ప్రారంభించి, 8 ఏళ్ల తర్వాత పెరిగిన డైట్, కాస్మోటిక్ చార్జీల వివరాలను వెల్లడించారు.

మెనూ అమలు చేయాలి


చెరువుమాధారంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ప్రత్యేకాధికారి ఖలీల్

నేలకొండపల్లి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూను కచ్చితంగా అమలు చేయాలని చెరువుమాధారం వసతి గృహం ప్రత్యేకాధికారి షేక్ ఖలీల్ ఆదేశించారు. స్థానిక వసతి గృహంలో శనివారం నూతన మెనూను ప్రారంభించి.. మెనూ షీట్ ప్రకారం ప్రతీ రోజు అందిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహం సంక్షేమాధికారి రాచూరి ఓదెలు, పేరెంట్స్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే రాజేశ్వరపురం వసతి గృహంలో ఎంపీడీఓ యర్రయ్య, సింగారెడ్డిపాలెం గురుకుల పాఠశాలలో తహసీల్దార్ మానిక్ రావ్ విద్యార్థులతో కలిసి భోజనాలు చేశారు.

సీపీఎం బలోపేతానికి కృషి

కూసుమంచి: పాలేరు నియోజకవర్గంలో సీపీఎంను బలోపేతం చేసి గత వైభవాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని పార్టీ పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ అన్నారు. శనివారం కూసుమంచిలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 2016లో డివిజన్ కమిటీలను రద్దు చేసిన పార్టీ తిరిగి ఇప్పుడు పునరుద్ధరించిందన్నారు. పాలేరు డివిజన్ కమిటీ ఇటీవల ఎన్నికైందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో కలిసి మిలిటెంట్ ఉద్యమాలను ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు ఇస్తూనే ప్రజా వ్యతిరేక కార్యకలాపాలపై తిరుగుబాటు చేస్తుందన్నారు. పాలేరులో పార్టీ గత ప్రాభవం కోల్పోయిందని, తిరిగి పూర్వవైభవం కోసం అన్ని గ్రామాలను సందర్శించి పార్టీని వీడిన వారందరినీ తిరిగి పార్టీలోకి చేరేలా కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ కూసుమంచి, ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం మండల కార్యదర్శులు తోటకూరి రాజశేఖర్, సుదర్శన్‌రెడ్డి, కొమ్ము శ్రీను, పార్టీ డివిజన్ నాయకులు షేక్ బషీరుద్దీన్, ఎడవెల్లి రమణారెడ్డి, మల్లెల సన్మంతరావు, గుడవర్తి నాగేశ్వరరావు, ప్రతాపనేని వెంకటేశ్వరరావు, మూడ్ గన్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

చలో అసెంబ్లీని జయప్రదం చేయండి

తిరుమలాయపాలెం: విద్యారంగాన్ని బలోపేతం చేయాలని ఈ నెల 17న పీడీఎస్‌యూ ఆధ్వర్యాన చేపట్టే చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం డివిజన్ నాయకుడు తిమ్మిడి రఘు పిలుపునిచ్చారు. శనివారం బచ్చోడులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు నాసిరకమైన భోజనం వడ్డిస్తున్నా.. ప్రభుత్వం పర్యవేక్షణ చేయకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచారు కానీ ఆరు నెలలుగా బకాయిలను విడుదల చేయడం లేదన్నారు. మన ఊరు–మనబడి కింద ఎంపికైన పాఠశాలలు అసంపూర్ణంగా ఉన్నా ఆదర్శ పాఠశాలలుగా మార్చారు కానీ నిర్మాణాలు పూర్తి చేయకుండా వదిలేశారన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం చేపట్టే చలో అసెంబ్లీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రతీ గ్రామానికి సీసీ రహదారులు


కూలీలతో మంత్రి శ్రీనివాసరెడ్డి


పూజలు చేస్తున్న కందాల ఉపేందర్‌రెడ్డి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి: పాలేరు నియోజకవర్గంలో ప్రతీ గ్రామానికి సీసీ రహదారులు నిర్మిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నాయకన్‌గూడెం గ్రామంలో సీసీ రహదారుల నిర్మాణాలను శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రహదారులు పూర్తయ్యాక డ్రెయినేజీలు నిర్మిస్తామని, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

కూలీలతో ముచ్చట..

నాయకన్‌గూడెం నుంచి తిరుమలాయపాలెం మండలం వెళ్తున్న మంత్రి మార్గ మధ్యలోని నర్సింహులగూడెం సమీపాన కూలీలు పనులకు వెళ్తుండగా వారితో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను విన్నవించగా.. సమస్యను పరిష్కరిస్తానన్నారు. అలాగే ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు.

ప్రత్యేక పూజలు

మండలంలోని పెరికసింగారం గ్రామంలో శనివారం బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవంతో పాటు ముత్యాలమ్మ, గంగమ్మ ఆలయాల ప్రారంభం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి వేడుకలో పాల్గొని పూజలు చేశాక రూ.5లక్షల విరాళాన్ని నిర్వహణ కమిటీకి అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

మంత్రికి వినతి

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): ప్రభుత్వ ఆస్పత్రిని బలోపేతం చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం పూర్వ రాష్ట్ర కార్యదర్శి చంద్ర అరుణ, రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ శిరోమణి, జిల్లా కార్యదర్శి ఎన్‌వీ రాకేష్‌లు కోరారు. ఈమేరకు శనివారం మంత్రి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రిలో ఫీజుల దోపిడీని అరికట్టాలని, జిల్లాలోని వైద్యులు, నర్సులు తదితర ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, పాత ఆస్పత్రిలోని మూత్రశాలలను బయట ఆవరణలో నిర్మించాలని, లోపల ఉన్న మూత్రశాలలను మెరుగుపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కెచ్చల కల్పన, కోశాధికారి టి.ఝాన్సీ, జిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి, సహాయ కార్యదర్శి ప్రతాపనేని శోభ, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు జాటోత్ ప్రేమ్‌సింగ్, జిల్లా నాయకులు మామిడాల వెంకటేష్, చంద్, శివలాల్ తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' సర్వే పారదర్శకంగా జరగాలి

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజాపాలన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే పారదర్శకంగా జరగాలని జిల్లా పరిషత్ సీఈఓ దీక్షరైనా అన్నారు. శనివారం నగరంలోని 48వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ తోట గోవిందమ్మ–రామారావులతో కలిసి పర్యవేక్షించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. డివిజన్‌లో పర్యటించి సర్వే తీరును పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఒక్క లబ్ధిదారుడి సమాచారాన్ని సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిల్ సభ్యుడు వెంకట్, డివిజన్ అధ్యక్షుడు చేతి కృష్ణ, మైనారిటీ నాయకుడు షేక్ బాబా, డివిజన్ బాధ్యులు గుగులోతు కిషన్‌నాయక్, గుత్తి నవీన్, గురుస్వామి, వేల్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని చెరుకూరి మామిడి తోటలో శనివారం స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టల్(ఎస్‌ఎంహెచ్) మాల పూర్వ విద్యార్థులు(2000–05 బ్యాచ్) ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకుని నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుత, భవిష్యత్‌లోని హాస్టల్ విద్యార్థులకు వసతులు, విజ్ఞానం పెంపుదలకు తగిన ఏర్పాట్లపై చర్చించారు. అనంతరంఎస్‌ఎంహెచ్ మాల పూర్వ విద్యార్థుల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మద్రి ప్రకాశ్, గౌరవ సలహాదారులుగా గార్లపాటి రవి, గుడిపూడి కృష్ణ, అధ్యక్షుడిగా దాసరి వీరబాబు, ఉపాధ్యక్షులుగా పణితి పాపారావు, గుండుమళ్ల ప్రభాకర్ రావు, జనరల్ సెక్రటరీగా పాలకుర్తి భాస్కర్, జాయింట్ సెక్రటరీలుగా బుర్రి నరసింహారావు, పణితి రమేష్ బాబు, ప్రచార కార్యదర్శిగా నందికొల బాలకృష్ణ, ట్రెజరర్‌గా దుమాల రామారావు, ఈసీ సభ్యులుగా పూరిటి వెంకటేశ్వర్లు, ముత్తమాల ప్రకాష్‌రావు, గోరింట్ల వెంకటేశ్వర్లు, గుజ్జు కృష్ణ, పల్లె వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు.

మాజీ ఎంపీపీకి నివాళి

తిరుమలాయపాలెం: మండల మాజీ ఎంపీపీ కొక్కిరేణి గ్రామానికి చెందిన ఊడుగు రామయ్యకు పలువురు నేతలు నివాళులర్పించారు. శనివారం ఆయన దశదిన కార్యక్రమంలో మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బొర్రా రాజశేఖర్, మాజీ జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, అరవిందరెడ్డి తదితరులు పాల్గొని నివాళులర్పించి, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మినీ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ధర్నా


ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): గాంధీచౌక్ కమాన్‌బజార్ అనుసంధానంగా మినీ బ్రిడ్జిని నిర్మించాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు యర్రా శ్రీకాంత్, సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్‌లు డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం వన్‌టౌన్ కమిటీ, త్రీటౌన్ కమిటీల ఆధ్వర్యాన గాంధీచౌక్ మధ్య గేటు వద్ద సంతకాల సేకరణతో పాటు మధ్య గేటు నుంచి గాంధీచౌక్ సర్కిల్ గోల్డ్ షాపుల లైన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈమార్గంలో ఎప్పుడు వెళ్లాలన్నా రైల్వే గేటు మూసి ఉండడంతో ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు, చాలాసేపు వేచి ఉండాల్సి వస్తుందని, లేదంటే చర్చి కాంపౌండ్ బ్రిడ్జి లేదా ఇతర మార్గాల నుంచి చుట్టూ తిరిగి రావాల్సి వస్తుందన్నారు. వీరి బాధలను దృష్టిలో ఉంచుకుని స్థానిక మంత్రులు మినీ బ్రిడ్జి ఏర్పాటు చేసేలా రైల్వే వారికి ప్రతిపాదనలు పంపాలని డిమాండ్ చేశారు. సీపీఎం ఖమ్మం 3 టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం ఖమ్మం జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ, ఎస్‌కె మీరా, కార్యదర్శులు షేక్ నాగులమీరా, బోడపాట్ల సుదర్శన్, ఎస్ నవీన్‌రెడ్డి, బత్తిని ఉపేందర్, 35వ డివిజన్ కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, నాయకులు బండారు యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

'మాదిగలకు అన్ని రంగాల్లో అన్యాయం'

రఘునాథపాలెం: తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు అన్ని రంగాల్లో తీవ్ర అన్యాయం చేస్తుందని ఎమ్మార్పీఎస్ రఘునాథపాలెం మండల అధ్యక్షుడు మంద గోపాల్‌రావు మాదిగ విమర్శించారు. శనివారం మంచుకొండలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, ఉద్యోగాల నియామకాల్లో మాదిగలకు అన్యాయం చేస్తుందని, ఈమేరకు ప్రతీ గ్రామంలో మండల కమిటీల నిర్మాణం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్ ఉద్యమాల నిర్మాణం కోసం మాదిగ జాతి ఏకమై కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ నెల 19న జరగబోయే రఘునాథపాలెం మండల కమిటీ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు మంద ప్రభాకర్, పెనుగూరు నాగేశ్వరావు, అన్నపోగు పుల్లయ్య, బొడ్డు వెంకన్న, పెనుగూరు సురేష్, మిట్టగాపల సుధాకర్, రామారావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'హార్వెస్ట్' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంసహకారనగర్: ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే డాక్టర్ ఏఎస్ రావు అవార్డ్స్ కౌన్సిల్ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్‌లో తమ విద్యార్థులు ప్రతిభ కనపరిచారని హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల యాజమాన్యం తెలిపింది. పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదలవగా.. 10వ తరగతి విద్యార్థి వరుణ్ శ్రీచైతన్య ద్వితీయస్థానం, కె.రిష్లత్ నాలుగో స్థానం, హిమవర్షిని ఆరో స్థానం సాధించగా.. వారిని శనివారం రవిమారుత్, ఆర్.పార్వతీరెడ్డి అభినందించారు.

'న్యూ ఇరా'లో శిక్షణ

ఖమ్మంసహకారనగర్: హిందీ ఉపాధ్యాయులకు బోధనా పద్ధతుల్లో మెళకువలు నేర్పేందుకు శిక్షకురాలు రామలక్ష్మిదాస్ శనివారం న్యూ ఇరా పాఠశాలలో వ్యత్యంతర శిక్షణ తరగతులు నిర్వహించారు. హిందీ మాట్లాడటంలో, అర్థం చేసుకోవడంలో ఎదుర్కొనే సమస్యలను అధిగమించడం ఎలాగో వివరించారు. ఐవీ రమణారావు, పి.భూమేశ్వరరావు పాల్గొన్నారు.

'సర్వజ్ఞ' విద్యార్థులకు పతకాలు

ఖమ్మంసహకారనగర్: ఈ నెల 11 నుంచి 13 వరకు నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో అండర్–14, అండర్–17 ఫుట్‌బాల్, షటిల్ పోటీల్లో తమ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్ నాగేంద్రకుమార్ తెలిపారు. ఫుట్‌బాల్‌లో జేమిత్, నేహామాధురి, లాస్య, అశ్విక్, ప్రహర్ష, శశాంక్, రాహుల్, అఖిల్, మహీధర్, శ్రీనాథ్, తనీశ్, శ్యామ్ మొదటిస్థానంలో నిలిచారని, షటిల్ అండర్–14, 17 సింగిల్స్‌లో వర్షిత్, లుకేశ్, శ్రీనివాస్, శ్రీకర్, శ్రీనాథ్ రెండోస్థానంలో నిలిచారన్నారు. కేతన్, చరణ్ డబుల్స్‌లో మొదటి స్థానం సాధించి బంగారు పతకాలను గెలుచుకన్నట్లు వివరించారు.

'న్యూ విజన్' విద్యార్థులు..

ఖమ్మంసహకారనగర్: డాక్టర్ ఏఎస్ రావు అవార్డ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభాన్వేషణ పోటీ పరీక్షల్లో నగరంలోని న్యూ విజన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. 39 మంది విద్యార్థులు అర్హత సాధించారని, 9వ తరగతి నుంచి 28 మంది విద్యార్థులు అర్హత సాధించారని ఒలింపియాడ్ స్కూల్ ప్రిన్సిపాల్ మైకెల్ తెలిపారు. విద్యార్థులను సీహెచ్ కార్తీక్ సీహచ్‌జీకే ప్రసాద్ తదితరులు అభినందించారు.

క్రీడా పోటీలు ప్రారంభం

ఖమ్మంస్పోర్ట్స్: శ్రీ చైతన్య విద్యాసంస్థల నేతృత్వంలో జోనల్‌స్థాయి వార్షిక క్రీడాపోటీలు శనివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. టూటౌన్ సీఐ బాలకృష్ణ, శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఎంఈఓ శైలజలక్ష్మి ప్రారంభించారు. జోనల్‌స్థాయి పోటీలకు 20 శ్రీచైతన్య పాఠశాలల నుంచి 2,100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖో–ఖో, త్రోబాల్, క్యారమ్స్, చెస్ పోటీలను అండర్–17, 14 బాలబాలికలకు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎంలు శ్రీచేతన్ మాధేర్, జయప్రకాష్‌తోపాటు శర్మ, నాగప్రవీణ, ఏడుకొండలు, ఇస్మాయిల్, నీరజ, మురళీమోహన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి సీపీఐ వందేళ్ల వేడుకలు

ఖమ్మంమయూరిసెంటర్: భారత కమ్యూనిస్టు పార్టీ 100వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా ఈ నెల 26 నుంచి ఏడాది పొడవున కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఖమ్మంలో భారీ ప్రదర్శన, రెడ్ షర్ట్ వలంటీర్ల కవాత్, బహిరంగ సభ ఉంటుందన్నారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో పతాకావిష్కరణ చేస్తామని, ఏడాది పొడవునా కవి సమ్మేళనాలు, సెమినార్‌లు నిర్వహించి పార్టీ గత చరిత్రను, సాధించిన పోరాట విజయాలను నేటి తరాలకు తెలియజేస్తామన్నారు. ఈ నెల 30న వందేళ్ల రాష్ట్ర స్థాయి ప్రారంభసభ నల్లగొండలో జరుగుతుందని సురేష్ తెలిపారు. ఢిల్లీ సరిహద్దులలో సాగుతున్న రైతాంగ ఆందోళనకు, గత నాలుగు రోజులుగా ఖమ్మంలో సమ్మెచేస్తున్న సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మెకు సీపీఐ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. స్థానిక సంస్థలకు పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గసభ్యుడు మహ్మద్ సలాం తదితరులు పాల్గొన్నారు.

పార్కుల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలి


వాకర్లతో మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని వాకర్స్ ప్యారడైజ్‌ను శనివారం నగర మేయర్ పునుకొల్లు నీరజ సందర్శించారు. మార్నింగ్ వాకర్లతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వాకింగ్ ట్రాక్‌పై ఒక లేయర్ మట్టి వేయాలని, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని వాకర్లు మేయర్స్ దృష్టి తీసుకొచ్చారు. అనంతరం ఐలాండ్‌లో ఉన్న పంచతత్వ ట్రాక్‌ను సందర్శించి వినియోగంలోకి తీసుకురావాలని, కూర్చునేందుకు సిమెంట్ బల్లాలను ఏర్పాటు చేయాలన్నారు. వాకర్ ప్యారడైజ్, లకారం ట్యాంక్‌బండ్ మధ్యలోని వాగును శుభ్రపరిచేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ రాధిక, ఏఈ శ్రీనివాస్, సరిపుడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.